అణగారిన జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం 28 జూన్ 2023

ఇంట్లో పెట్టిన బైక్ చోరీ

- కోటగల్లిలో ఘటన

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాత్రి సమయంలో ఇంట్లో పార్క్ చేసిన బైక్ చోరీకి గురైన ఘటన నిజామాబాద్ పట్టణంలోని నాల్గవ టౌన్ పరిధిలోని కోటగల్లిలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. కోటగల్లికి చెందిన పొలకొండ ప్రవీణ్ ఓ ప్రయివేటు కంపెనీలో పని చేస్తాడు. సోమవారం రాత్రి భోజనం పూర్తయ్యాక నిద్రించే సమయంలో ద్విచక్రవాహనం (టీఎస్ 16 ఎఫ్ ఎఫ్ 3021) ఇంటి లోపల పెట్టాడు. లోపలి నుంచి గడియా కూడా పెట్టాడు. రాత్రి 12 గంటల సమయంలోనూ బైక్ ఉంది. కానీ బాధితుడి తండ్రి 3 గంటలకు లేచి చూడగా బైక్ లేదు. గోడ దూకి వచ్చిన దొంగలు బైక్‌తో ఉడాయించారు. బాధితుడు నాల్గో టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.


ఎట్టకేలకు కుక్కల తరలింపు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని పలుమార్లు కథనాలు పెట్టడంతో పాటు ఇటీవల ఐదుగురిని గాయపర్చడంతో ఎట్టకేలకు జీపీ సిబ్బంది, అధికారులు స్పందించారు. మంగళవారం వీధి కుక్కలను పట్టుకొని తరలించే ప్రక్రియ చేపట్టారు. కుక్కలను పూర్తిగా నివారించాలని తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి కొన్నింటిని పట్టుకొని మరికొన్నింటిని వదిలిపెట్టకుండా.. ప్రతి కుక్కను పట్టుకొని తరలించాలని స్థానికులు కోరుతున్నారు.


కుక్కలను పట్టి తరలిస్తున్న సిబ్బంది

హస్తంలో జోష్



- కాంగ్రెస్ గూటికి అరికెల
- ముత్యాలదీ అదే దారి?
- ఆరేంజ్ ట్రావెల్స్ అధినేత రాకపై జిల్లా నేతల వ్యతిరేకత
- బాల్కొండలో పోటీకి జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి రెడీ

జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం దిశగా అడుగులు పడుతున్నాయి. ఒకప్పుడు ఇందూరు గడ్డ కాంగ్రెస్ అడ్డాగా ఉండేది. అయితే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, బీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో ముఖ్య నేతలంతా ఆ పార్టీని వీడారు. కానీ కర్నాటక ఫలితాల ప్రభావం, రాష్ట్రవ్యాప్తంగా కీలక నేతలు మళ్లీ హస్తంలోకి చేరడంతో జిల్లా కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహం నెలకొంటోంది. జిల్లాలోనూ మళ్లీ కాంగ్రెస్ పార్టీ పుంజుకుంటోంది. ఇప్పటికే నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు అరికెల నర్సారెడ్డి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోగా.. ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి సైతం కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఆయన మంగళవారం ఢిల్లీకి పయనమయ్యారు. బాల్కొండలో పోటీకి గ్రీన్‌సిగ్నల్ వస్తే వెంటనే చేరేందుకు సిద్ధమని తెలిసింది.

-నవతెలంగాణ, నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కర్నాటక రాష్ట్ర అసెంబ్లీ ఫలితాల పుణ్యమా అని జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఆ ఫలితాల ప్రభావంతో మొన్నటి వరకు బీజేపీ వైపు చూసిన నేతలంతా ఒక్కొక్కరుగా కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. గత ఎన్నికల్లో బీఎస్పీ నుంచి పోటీ చేసిన ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌కుమార్ కాంగ్రెస్ గూటికి చేరేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం ఢిల్లీకి వెళ్లి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని కలిశారు. ఎన్నికల్లో పోటీకి అభ్యర్థిత్వం హామీ కోసం ఎదురుచూస్తున్నట్టు సమాచారం. కానీ పార్టీలో చేరే సమయంలో బేషరతుగా చేరాలన్నది కాంగ్రెస్ పార్టీ నిబంధన. ఏ నాయకుడు చేరినా ముందస్తుగా ఎలాంటి హామీలు ఇవ్వరు. బాల్కొండ నియోజకవర్గం నుంచి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పోటీకి సిద్ధమవడంతో ముత్యాల సునీల్‌కుమార్‌కు ఈ విషయంలో స్పష్టమైన హామీ లభించడం లేదు. గత రెండు నెలలుగా నియోజకవర్గంలో ప్రతి పల్లె తిరుగుతూ మోహన్‌రెడ్డి ప్రజలతో మమేకమవుతున్నారు. జులై 5వ తేదీ నుంచి పల్లెనిద్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీంతో జిల్లా నేతలతో పూర్తిస్థాయిలో సంప్రదిం చిన తరువాతనే స్పష్టత ఇస్తామని ముత్యాల సునీల్‌కుమార్‌కు పీసీసీ చీఫ్ చెప్పినట్టు తెలిసింది. గత ఎన్నికల సమయంలోనే ముత్యాల సునీల్‌కుమార్ కాంగ్రెస్ టిక్కెట్టు ఆశించినప్పటికీ అధిష్టానం హామీ ఇవ్వలేదు. దీంతో ఆయన బీఎస్పీ నుంచి బిఫాం తీసుకుని ఎన్నికల్లో పోటీ చేశారు. ప్రస్తుతమూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పోటీకి సిద్ధమవుతుండటంతో చేరికపై సందిగ్ధం నెలకొంది. అయితే ఆయన రాకను జిల్లా కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. మొన్నటి వరకు బీజేపీలో చేరేందుకు సిద్ధమయ్యారని, ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్‌లోకి వస్తున్నారని, అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారు.

రూరల్‌లో బలోపేతం..

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో బలోపేతమయ్యింది. బీఆర్ఎస్ పార్టీ నుంచి సీనియర్ నాయకులు అరికెల నర్సారెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఆయనకు మండవ వెంకటేశ్వరరావు నుంచి పూర్తిస్థాయి మద్దతు ఉండటంతో ఆయన పోటీకి సిద్ధమని సంకేతం ఇస్తున్నారు. ఈ నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం ఆయన కూడా పోటీకి సిద్ధంగా ఉన్నారు. వీరిద్దరితో పాటు మరో సీనియర్ నాయకులు నగేష్‌రెడ్డి సైతం పార్టీ అధిష్టానం అనుమతి ఇస్తే పోటీకి సిద్ధంగా ఉన్నారు. అయితే రూరల్‌లో పార్టీ నేతల మధ్య ఐక్యత ఉండటం విశేషం. ప్రస్తుతం నియోజకవర్గంలో మండలాలవారిగా ముఖ్య నేతల సమావేశాలు నిర్వహిస్తున్నారు. అన్ని సమావేశాలకు భూపతిరెడ్డి, నగేష్‌రెడ్డి కలిసి పాల్గొనడం విశేషం. ఒకవేళ రూరల్‌లో కాంగ్రెస్ పార్టీ ఏ నాయకుడికి టిక్కెట్టు ఇచ్చిన మరో ఇద్దరు నేతలు మద్దతుగా నిలిస్తే కాంగ్రెస్ పార్టీ గెలుపు నల్లేరుపై నడక అవుతుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. అయితే భవిష్యత్తులో జిల్లాలోని మరికొంత మంది నాయకులు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరాతారని జిల్లా నాయకులు చెబుతున్నారు.

టమోత..

- కిలో 100 రూపాయలు పలికిన ధర

నవతెలంగాణ-వర్ని

టమాటా ధర ఆకాశాన్నంటింది. ఏకంగా కిలో రూ.100 పలుకుతుంది. అన్ని కూరల్లో విరివిగా వాడే టమాట ధర అమాంతం పెరగడంతో వినియోగదారులు వాపోతున్నారు. ప్రతి కూరలో రోజు వాడే టమాట ధర పెరగటంతో ప్రజలు కొనటానికి వెనకడుగు వేస్తున్నారు. మంగళవారం వర్ని మార్కెట్‌లో టమాటా ధర 100 రూపాయలు పలకడంతో పలువురు కొనుగోలుకు వెనకడగు వేయగా.. మరికొందరు పావుకిలోతో సరిపెట్టుకున్నారు. దిగుబడులు తగ్గగా, ప్రస్తుతం కొత్తగా పంట వేస్తుండటంతో టమాటా సరఫరా తగ్గింది. దీంతో ధర అమాంతం పెరిగింది. ధర పెరగడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వర్ని మార్కెట్‌లో టమాటల విక్రయం

గంజాయి పట్టివేత

ఒరిస్సా నుంచి తెప్పించి విక్రయాలు

నవతెలంగాణ-సిరికొండ

గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి 950 గ్రాముల గంజాయినీ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ నర్సింలు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎక్సైజ్ శాఖ భీమ్‌గల్ బృందం సిరికొండ నుండి కొండూరు రోడ్డులో రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా గంజాయి నిందితుడు బసాయి భాను నుంచి కొండూరు గ్రామం వద్ద 950గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. నిందితున్ని అరెస్టు చేసి అతని బైక్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సిరికొండ గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు వొల్లం మహేష్ పరారీలో ఉన్నట్టు తెలిపారు. ఒరిస్సా ఏజెన్సీ ప్రాంతం నుండి ఎండు గంజాయిని కొనుగోలు చేసి డిచ్‌పల్లి, ఇందల్వాయి, సిరికొండ, భీమ్‌గల్ మండలాల చుట్టుపక్కల గ్రామాల్లో విక్రయిస్తున్నారని తెలిపారు. ఇందులో వంశీ ప్రధాన విక్రయదారుడని, వొల్లం వంశీపై గతంలో దొంగతనం కేసులు, ఎండు గంజాయి కేసులు, రాజమండ్రి విశాఖపట్నం, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం మరియు జగిత్యాల పోలీస్ స్టేషన్లలో నమోదయ్యాయని తెలిపారు. వీరిని పట్టుకున్న వారిలో పి.వేణు మాధవ్ -సర్కిల్ ఇన్స్పెక్టర్, పి.నర్సింహులు-సబ్-ఇన్‌స్పెక్టర్, ఫయాజ్-హెడ్ కానిస్టేబుల్,దాతాద్రి కానిస్టేబుల్, మహేష్ కానిస్టేబుల్, శ్రీనివాస్ రెడ్డి కానిస్టేబుల్ లు పాల్గొన్నారు.


నిందితుడిని అరెస్ట్ చేసి గంజాయి స్వాధీనం

మంత్రి వేముల అవినీతిపరుడే

- కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ముమ్మాటికి అవినీతి పరుడేనని సుద్ద పూస మాటలు మాట్లాడితే నీతి మంతుడు కాలేడని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి మండి పడ్డారు. నగరంలోని కాంగ్రెస్ భవనంలో మంగళవారం పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్బిన్ హందాన్, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు అన్వేష్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.


మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

తాను చేసిన అవినీతిని నిరూపించాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరాడని నిజానికి ప్రశాంత్ రెడ్డి అవినీతిపరుడని, సహజ వనరులు దోచుకుంటున్న దొంగ అని,రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో సహజ వనరులైన ఇసుక, మైనింగ్, మోరం ను ఎమ్మెల్యేలు దోచుకుంటున్నది ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఏర్గట్లలో మైనింగ్ పేరుతో వందల కోట్లు అవినీతికి పాల్పడ్డాడని ఆరోపించారు. మిషన్ భగీరథ వైస్ చైర్మన్‌గా ఉన్నప్పుడు చేసిన అవినీతి బహిరంగ రహస్యమే అని అన్నారు. ఎవ్వరూ కూడా కాంట్రాక్టర్ దగ్గర తీసుకున్న డబ్బుకు ఫోటోలు వీడియోలు తీసుకోరని కాబట్టి ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ తరపున తాను అవినీతి చేశారని మేము ప్రశ్నిస్తున్నాం కాబట్టి మీరే అవినీతి చేయలేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత ప్రశాంత్ రెడ్డి పైన ఉందని అన్నారు. రసీద్ తప్పితే మసీద్ అనే నానుడి ఉందని, అవినీతి చేయలేదని ఎక్కడ ప్రమాణం చేస్తారో చెప్తే అక్కడికి తాము వస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు విక్కీ యాదవ్, జిల్లా ఎన్ఎస్యుఐ అధ్యక్షులు వేణురాజ్ ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో
పేదలకే ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

- సీపీఐ(ఎం), ప్రజాసంఘాల డిమాండ్
- ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఎడపల్లి

ప్రభుత్వ భూముల్లో పేదలకే ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ(ఎం), ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల మంగళవారం ఆందోళనలు చేపట్టారు. సీపీఐ(ఎం) నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఎడపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఏవోకి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు, నగర కార్యదర్శి పెద్దిసూరి మాట్లాడారు. దుబ్బ ప్రాంతంలోని 171, 172 సర్వే నెంబర్లలో గల ప్రభుత్వ స్థలంలో ఇళ్ల స్థలాలు లేని పేదలని ఏకం చేసి 15 రోజుల క్రితం గుడిసెలు వేసి భూ పోరాటం ప్రారంభించినట్టు తెలిపారు. గుడిసెలు వేసిన పేదలు రాత్రింబవల్లు అక్కడే నివాసం ఉంటూ వర్షాల కారణంగా విష సర్పాలు, కీటకాలు, తేళ్లు, ఇతర ప్రమాదాలు ఉన్నప్పటికీ ప్రాణాలను లెక్కచేయకుండా జానెడు నివాస స్థలం కోసం పోరాడుతున్నారని తెలిపారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అక్కడికి వచ్చి ఇది మా స్థలం మీరు ఖాళీ చేయాలి అని ప్రజల్ని బెదిరిస్తున్నారని న్నారు. ఇట్టి ప్రభుత్వ స్థలాలు రియల్ ఎస్టేట్, అక్రమ కబ్జాదారుల, కబంధహస్తాలకు బలికాకుండా వెంటనే రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని సర్వే చేసి ప్రభుత్వ స్థలానికి హద్దులు పాతి రక్షణ కల్పించి గుడిసెలు వేసుకున్న ప్రజలకు ఇళ్ల స్థలాలను ప్రభుత్వమే అధికారికంగా పంచిపెట్టాలని అన్నారు. ఎలాంటి నిబంధనలు లేకుండా ఇవ్వాలని మౌలిక సదుపాయాలు కల్పిస్తూ రోడ్లు, విద్యుత్తు, నీటి సౌకర్యాలు కల్పించి ప్రజలకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాల్యాల గోవర్ధన్, జిల్లా కమిటీ సభ్యులు బెజగం సుజాత, నగర కార్యదర్శి వర్గ సభ్యులు కటారి రాములు, పి మహేష్, నగర కమిటీ సభ్యులు డి కృష్ణ, నరసన్న, అనసూయమ్మ, అబ్దుల్, 300 మంది గుడిసె వాసులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం ఎదుట బైటాయించి నినాదాలు చేస్తున్న ప్రజలు, నాయకులు

ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేయాలి

ఎడపల్లి : తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో బోధన్, ఎడపల్లి మండలాల ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఎడపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దివెంకట రాములు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యేశాల గంగాధర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జంగం గంగాధర్ మాట్లాడారు. ఇండ్ల స్థలాలు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, వారికి పట్టాలు అందజేసి ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు.. మొత్తంగా రూ15 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఆకుల శేఖర్‌కు అందజేశారు. కార్యక్రమంలో గంగమణి, లక్ష్మి బాలు, సాయమ్మ మణమ్మ, భూమవ్వ, రాజమణి, రాధా, పార్క్ ఖలీల్, హైమద్, నజీర్ పాల్గొన్నారు.



ఎడపల్లిలో ధర్నా చేపటి నినదాలు చేస్తున్న ప్రజలు, నాయకులు

ట్రాన్స్ ఫార్మర్ల చోరీ కేసులో
ఇద్దరికీ జైలు శిక్ష

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని పలు గ్రామాలలో 2022వ సంవత్సరంలో వరుసగా ట్రాన్స్ ఫార్మర్స్ దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు నిందితులకు ఆర్మూరు కోర్టు మెజిస్ట్రేట్ ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష విధించినట్లు కమ్మర్‌పల్లి ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.... మండలంలోని పలు గ్రామాల్లో 2022వ సంవత్సరంలో నాలుగు ట్రాన్స్ ఫార్మర్ల చోరీ జరిగింది. చోరీ కేసులో ఒంగోలు జిల్లా సింగరాయకొండ గ్రామానికి చెందిన పల్లిపాటి ఏసుదాసు, శాలిపేట్ గ్రామము చిన్న శంకరంపేట మండలానికి చెందిన నర్రా శ్రీధర్ లను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుండి నాలుగు ట్రాన్స్ ఫార్మర్లకు సంబంధించి వారు దొంగిలించిన 280 కిలోల కాపర్ వైర్ ను స్వాధీనం చేసుకొని దర్యాప్తు అనంతరం ఇరువురి పై ఆర్మూరు ఏజేఎఫ్ సీఎం కోర్టు యందు చార్జిషీటు ఫైల్ చేసినట్లు తెలిపారు. కేసు ట్రయల్ అనంతరం ఆర్మూరు కోర్టు మెజిస్ట్రేట్ వేముల దీప్తి సాక్ష్యాధారాలను పరిశీలించి మంగళవారం నేరస్తులు ఇరువురికి నాలుగు ట్రాన్స్ ఫార్మర్ల దొంగతనం కేసులలో ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. ప్రభుత్వ తరపు న్యాయవాది పి. రాజేశ్వరి, కోర్ట్ కానిస్టేబుల్ వి. రామారావు ఈ కేసులో నిందితులకు జైలు శిక్ష పడే విధంగా కోర్టుకు సాక్షాలను సమర్పించినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

డేంజర్ టోల్..!



భిక్కనూర్ టోల్‌ప్లాజా వద్ద బీభత్సం సృష్టించి బోల్తా పడ్డ లారీ(ఫైల్)

- భిక్కనూర్ టోల్ ప్లాజా వద్ద తరుచూ ప్రమాదాలు
- ఇటీవల పదుల సంఖ్యలో ఘటనలు..
- ఇరుకు రోడ్డు, మూల మలుపు.. లైటింగ్ అంతంతే
- ప్రమాదాల నివారణా చర్యలు శూన్యం

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ టోల్ ప్లాజా.. ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇరుకు రోడ్డు, టోల్‌ప్లాజా ఉన్న సమాచారం సరిగ్గా లేకపోవడంతో వాహనాలు వేగంగా వస్తున్న క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. లైటింగ్ సరిగ్గా లేకపోవడం, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఇటీవల వరుసగా చోటుచేసుకోవడం ఆందోళనకరం. టోల్‌ప్లాజా సిబ్బంది ఒకరు మృత్యువాత పడగా.. మరో ద్విచక్రవాహనదారుడు సైతం మృతిచెందారు. తరుచూ ప్రమాదాలతో టూల్‌ప్లాజా సిబ్బంది గాయపడుతు న్నారు. దీంతో అక్కడ బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మీదుగా వెళ్తున్న 44వ జాతీయ రహదారిపై ఇందల్‌వాయితో పాటు భిక్కనూర్ వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. అయితే ముందుగా ఇందల్‌వాయి వద్ద టోల్‌ప్లాజా ఏర్పాటు చేయగా.. 60 కిలోమీటర్‌కు ఓ టూల్‌గేట్ ఉండాలనే ఉద్దేశ్యంతో ఆగమేఘాల మీద భిక్కనూర్ వద్ద ఎలాంటి ప్రణాళికలు లేకుండానే టోల్‌ప్లాజా నిర్మించారు. దీంతో ఇక్కడ ప్రమాదాలు నిత్యకృత్యం అయ్యాయి. తాజాగా సోమవారం రాత్రి కంటెయినర్ వేగంగా వచ్చి టూల్‌ప్లాజాలోని బూత్‌ను ఢీకొనడంతో సిబ్బంది గాయపడ్డారు.


ఇరుకు రోడ్డు.. మూల మలుపు

ఇందల్‌వాయి టోల్‌గేట్ వద్ద రోడ్డును విస్తరించి రోడ్డు వరుసలను పెంచారు. ఇరు వైపులా కలిపి 12 వరుసలకు విస్తరించారు. కానీ భిక్కనూర్ వద్ద రోడ్డును విస్తరించకపోగా.. ఇరు వైపులా కలిపి కేవలం ఆరు వరుసలు మాత్రమే విస్తరించారు. హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపుగా వచ్చే వాహనాలే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతు న్నాయి. టోల్‌ప్లాజాకు ముందు మూల మలుపు ఉండటం, టోల్ ప్లాజా ఉన్న సమాచారం కిలోమీటర్ దూరం నుంచి ఇవ్వాల్సి ఉన్నా.. విస్మరించడంతో ప్రమాదాలు తరుచూ జరుగుతు న్నాయి. దీంతో పాటు సెంట్రల్ లైటింగ్ సైతం సరిగ్గా లేకపోవడంతో రాత్రి వేళల్లోనే ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ఇటీవల ఇద్దరు మృతి.. పలువురికి గాయాలు

టోల్ ప్లాజా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాలలో ఇప్పటివరకు ఇద్దరు మరణించగా, 10 మందికి పైగా గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో టోల్ ప్లాజా సిబ్బందికి తలకు తీవ్ర గాయాలైన ఘటనలు ఉన్నాయి. టోల్ ప్లాజా వద్ద గతంలో టమాటా లోడ్ తో వెళ్తున్న లారీ బూత్ ని ఢీకొనడంతో నలుగురు టోల్ ప్లాజా సిబ్బందికి గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో అజిత్ అనే యువకుడు మరణించాడు. ద్విచక్ర వాహనం టోల్ ప్లాజా బూతును ఢీకొని శ్రావణ్ అనే యువకుడు మరణించాడు. లారీ కంటైనర్ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుండి ఢీకొనడంతో ప్రకాష్ అనే యువకుడు మరణించాడు. లారీ కంటైనర్ బూత్‌ను ఢీకొనడంతో టోల్ వసూలు సిబ్బంది ఆ సమయంలో అందులో లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. తరచూ ప్రమాదాలు జరగడంతో టోల్ ప్లాజాలో పనిచేస్తున్న సిబ్బంది తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహిస్తున్నారు. టోల్ ప్లాజా వద్ద ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా అధికారులు మాత్రం నివారణ చర్యలు చేపట్టలేదు.

ప్రమాదాలు నివరించేందుకు టోల్‌ప్లాజా వద్ద రోడ్డును విస్తరించాలని, లైటింగ్ ఏర్పాటు చేసి, టోల్‌ప్లాజా ఉన్న సమాచారం కిలోమీటర్ దూరం నుంచే ఇవ్వాలని వాహనదారులు కోరుతున్నారు. అదే విధంగా టోల్‌ప్లాజా సమీపంలో స్పీడ్‌బ్రేకర్ ఏర్పాటు చేయాలని అప్పుడే ప్రమాదాలను నివారించవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు.


మృతిచెందిన టూల్‌ప్లాజా సిబ్బంది(ఫైల్)

రక్షణ చర్యలు చేపట్టకుంటే.. విధులు చేపట్టబోం

ఎన్‌హెచ్‌ఏ పీడీ శ్రీనివాస్‌కు సిబ్బంది మొర

తరచూ టోల్ ప్లాజా వద్ద జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా రక్షణ చర్యలు చేపట్టి.. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని టోల్ ప్లాజా సిబ్బంది నేషనల్ హైవే అథారిటీ పీడీ శ్రీనివాసరావుకు తెలిపారు. సోమవారం రాత్రి జరిగిన ప్రమాదం విషయం తెలుసుకున్న పీడీ మంగళవారం ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. లైట్లు సరిగ్గా లేకపోవడం, బూతు వద్ద ఉన్న డివైడర్ ఎత్తు తక్కువగా ఉండడం, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నా యని టోల్ ప్లాజా సిబ్బంది పిడి దృష్టికి తీసుకువచ్చారు. వీలైనంత త్వరలో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని పిడి టోల్ ప్లాజా సిబ్బందికి హామీ ఇచ్చారు.


నాసిరకంగా డివైడర్‌లు నిర్మించారని చూపుతున్న సిబ్బంది

లైట్లు, బోర్డులు ఏర్పాటు చేయాలి

సంతోష్, వాహనదారుడు



టోల్ ప్లాజాకు ఇరువైపులా కిలోమీటర్ దూరం వరకు సూచిక బోర్డులు, హైమాస్ లైట్లను ఏర్పాటు చేయాలి. ప్రమాదాలు జరగకుండా రోడ్డుపై రేడియం లైట్లను ఏర్పాటు చేయాలి. మూలమలుపు వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



నవతెలంగాణ-సిరికొండ

మండలకేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో మంగళవారం జడ్పిటిసి మాలవత్ మాన్ సింగ్ నాయక్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు చలి తీవ్రత ఎక్కువ అవుతుందని, ప్రభుత్వం విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తుందని వాటిని పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తుందని, నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయ బృందాన్ని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కల్పన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ గది ప్రారంభం



నవతెలంగాణ-ఆర్మూర్

న్యాయస్థానం ఆవరణలో సీనియర్ బార్ అసోసియేషన్ గదిని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సరసం చిన్నారెడ్డి అధ్యక్షతన సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి నసీం సుల్తాన ,అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి వేముల దీప్తి నువ్వు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అశోక్ ట్రెజరర్ అరుణ్ గ్రంథాలయ కార్యదర్శి తుమ్మ సుకేష్, పిపి రాజేశ్వరి, పిపి అవారి రమేష్, సీనియర్ న్యాయవాదులు భూపతి రెడ్డి,జగదీశ్వర్ రెడ్డి, శ్రీధర్,కిష్టయ్య, నర్సయ్య , జూనియర్ న్యాయవాదుల పాల్గొన్నారు.

బ్యాంకింగ్‌పై క్విజ్ పోటీలు

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

నవతెలంగాణ-విలేకరులు

భీంగల్: పట్టణకేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీంగల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలకు మండల విద్యాధికారి స్వామి, బ్యాంక్ మేనేజర్ కవేంద్రలు పరిశీలకులుగా వ్యవహరించారు. ఈపోటీల్లో బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ, బెజ్జోర ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ, ముచ్కూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి 5 వేల రూపాయలు, ద్వితీయ స్థానంకు 4 వేలు, తృతీయ స్థానానికి 3000వేల నగదు ప్రోత్సాహకాన్ని యంఈఓ, మేనేజర్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రఘువాస్, పీఆర్‌టీయు మండల అధ్యక్షుడు వాసుదేవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థికపరమైన, బ్యాంకుకు సంబంధించిన అంశాలపై క్విజ్ పోటీని నిర్వహించారు. ఈ పోటీలో కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల మండలాలకు చెందిన అన్ని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో మొదటి బహుమతిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమ్మర్ పల్లికి చెందిన రిషిక, బాలాజీ గెలుచుకున్నారు. ద్వితీయ బహుమతిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దొన్కల్‌కి చెందిన రవితేజ, అరుణ్ గెలుపొందగా తృతీయ బహుమతిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోనాపూర్ కు చెందిన లహరిక, ఆకాంక్ష గెలుచుకున్నారు. ఈ సందర్భంగా కమ్మర్‌పల్లి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ నగదు గెలుపొందిన విద్యార్థులకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. బ్యాంకు ఖాతాలు లేనట్లయితే జీరో అకౌంట్ లు తీస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బ్యాంకు ప్రాజెక్టుల గురించి విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించారు. క్విజ్ పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్లతోపాటు రవాణా భత్యం కింద రూ.250 అందజేశారు. కార్యక్రమంలో కమ్మర్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ గౌడ్, ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల ప్రధానో పాధ్యా యులు, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ జిల్లా ఉన్నత పాఠశాలలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు మంగళవారం క్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు. బాల్కొండ ఉమ్మడి మండలంలోని ముప్కాల్, మెండోరా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నట్లు బాల్కొండ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం.ఇందిరా తెలిపారు. ఈ క్విజ్ కాంపిటీషన్ పోటీలలో బాల్కొండ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతి పొందారని అన్నారు. రెండోవ బహుమతిగా ప్రభుత్వ పాఠశాల కిసాన్ నగర్, మూడోవ బహుమతిని మెండోరా కేజీబీవీ విద్యార్థులు పొందారని చెప్పారు. కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారులు గణేష్ దేశముఖ్, సంధ్యారాణి, బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాక్లూర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో క్విజ్ కాంపిటీషన్ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని పదవ తరగతి విద్యార్థిని జి. ఆకాంక్ష, అర్పిత లు మొదటి బహుమతి, ఎస్. అర్జున్, రూపేష్ నందు మదన్ పల్లి పాఠశాల విద్యార్థులు రెండవ బహుమతి, జే. భవ్య రుచిత చిన్నపూర్ పాఠశాల విద్యార్థినిలు మూడవ బహుమతి గెలుపొందారు. మొదటి గెలుపొందిన వారికి జిల్లా స్థాయిలో నిజామాబాద్‌లో జూలై 4న క్విజ్ పోటీ ఉంటుందనీ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఆర్బీఐ ప్రతినిధి పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి : ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు



భీంగల్: నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న ఎంఈవో



ముప్కాల్‌లో..

బాధితునికి అంబులెన్స్ ఏర్పాటు

రోటరీ క్లబ్ వారి దాతృత్వం

నవతెలంగాణ-కంఠేశ్వర్

దీర్ఘకాలిక సమస్యల నుండి ఉపశమనంకోసం హైదరాబాద్ నందుగల స్పర్శ కేంద్రానికి వర్ని మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన షేక్ జలీల్‌కు పంపించటాని అంబులెన్స్ ఏర్పాటుచేసినట్టు రోటరీ క్లబ్ నిజామాబాద్ క్లబ్ అధ్యక్షులు సతీష్ షాహ తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ సభ్యులు శ్యామ్ అగర్వాల్ ముందుకు వచ్చి అంబులెన్స్ అందించారు. ప్రతి నెల స్పర్శ ఆస్పత్రికి హైదరాబాద్ స్పర్శ కేంద్రం వారు నిజామాబాద్‌కు చెందిన రోగులు పేదవారి గురించి తెలుపడంవల్ల నిజామాబాద్ సభ్యులు కలిసి పంపించడంలో సహాయం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ విశాల్ ఆకుల,శ్యామ్ అగర్వాల్, వి.శ్రీనివాసరావు, జగదీశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా ప్రభుత్వ పాఠశాల



నవతెలంగాణ-నందిపేట్

మండలకేంద్రంలోని వెల్మల్ గ్రామంలోగల ప్రాథమిక పాఠశాల కొందరు మందు బాబులకు అడ్డాగా మారింది. ఉదయం తరగతులు జరుగుతున్నప్పటికీ తరగతి గదులలో బీరు సీసాలు, తినుబండారాలతో రాత్రుల్లో హంగామా చేస్తున్నారు. దీంతో పాఠశాల తరగతి గదుల్లో సీసాలు పగిలి దర్శనమివ్వడంతో పిల్లలు జంకుతున్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ ఉన్నప్పటికీ కొందరు గోడ దూకి ఇందులోకి వస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలకు పోలీసులు రక్షణ కల్పించాలని పిల్లల తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ మెడికల్ క్యాంపునకు స్పందన



క్యాంపల్‌లో పాల్గొన్న ప్రజలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పొగ తాగే వారు, పాన్ మసాలా నమిలేవారు, గుట్కా తినేవారు ఎక్కువగా క్యాన్సర్ బారిన పడుతున్నారని ప్రముఖ డాక్టర్ పి. రామ్మోహన్ రావు అన్నారు. నిజామాబాద్‌నగరంలోని అర్సపల్లిలో మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్, అర్సపల్లి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కార్పొరేటర్ లావణ్య నవీన్ అధ్యక్షతన జరిగిన క్యాన్సర్ స్క్రీనింగ్ మెడికల్ క్యాంపును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్రనాథ్ సూరి మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులను వాడేవారిని ముందుగా గుర్తించి స్క్రీనింగ్ చేస్తామని, మహిళలు కూడా స్వయంగా తమకు తామే క్యాన్సర్ లక్షణాలు గుర్తుపట్టే విధంగా శిక్షణ ఇస్తామని చెప్పారు. క్యాన్సర్ ఎంత త్వరగా గుర్తిస్తే అంత త్వరగా నియంత్రించవచ్చని తెలిపారు. అరసపల్లిలో నిర్వహించిన ఈ క్యాంపులో అధిక సంఖ్యలో మహిళలు, పురుషులు హాజరయ్యారు. మెమోగ్రామ్, పాప్స్మియర్, ఈసీజీ, ఎక్స్‌రేలు తదితర టెస్టులు నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో అర్సపల్లి అభివృద్ధి కమిటీ సభ్యులు, మల్లు స్వరాజ్యం ట్రస్ట్ నాయకులు రామ్మోహన్‌రావు, ఈవీఎల్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నాలేశ్వర్ లిఫ్ట్ పాలకవర్గానికి సన్మానం



లిఫ్ట్ పాలకవర్గాన్ని సన్మానించిన సొసైటీ చైర్మన్

నవతెలంగాణ-నవీపేట్

నూతనంగా గెలుపొందిన నాగేశ్వర్ లిఫ్ట్ పాలకవర్గానికి సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాన్లు శాలువాతో సన్మానించారు. నాళేశ్వర్ లిఫ్ట్ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాలేశ్వర్ లిఫ్ట్ చైర్మన్‌గా పుప్పాల భోజన్న, ఉపాధ్యక్షులుగా తోట శిరీష, సెక్రెటరీగా పుప్పాల శ్రీకాంత్, కోశాధికారిగా ఆర్మూర్ గంగాధర్, డైరెక్టర్లుగా శ్రీలత, హన్మండ్లు, నవీన్, రాజేశ్వర్, పోశెట్టి, సాయిలు, సుమన్ ఎంపిక చేశారు. అధ్యక్ష కార్యదర్శులకు ఎన్నికల అధికారి మురళి ఎంపిక పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ద్యాగ సరిన్, సొసైటీ చైర్మన్ మగ్గిరి హన్మండ్లు, ఉపసర్పంచ్ బాలాజీ లక్ష్మణ్, ఎస్ఐ రాజారెడ్డి, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో గుండె సంబంధిత సేవలందించాలి : పీడీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో గుండెకు సంబంధించిన వ్యాధులకు అన్ని రకాల సేవలు అందించాలని పిడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు వనమాల సత్యం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా వయస్సుకు సంబంధం లేకుండా అందరికీ గుండెకు సంబంధించిన వ్యాధులు వస్తున్నాయని, ఆస్పత్రికి వచ్చిన కేసులను హైదరాబాద్ కి రిఫర్ చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో గుండెకు సంబంధించిన వైద్యం లేక పేద ప్రజలు ఆర్థిక భారంతో ప్రైవేట్‌లో వైద్యం చేయించుకోలేక చనిపోతున్నారని అన్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్ లో లక్షల రూపాయలు వెచ్చిస్తే గాని సరైనటువంటి వైద్యం అందటం లేదని, ఆంజియోగ్రామ్ టెస్టులు, బైపాస్ సర్జరీలు ఆసుపత్రిలో చేయాలని, డాక్టర్ లను అందుబాటులో ఉంచాలని, గుండె సంబంధిత డిపార్ట్మెంట్ లేక మెడికల్ కాలేజ్ విద్యార్థులకి ఇంటర్న్ షిప్‌కి ఇబ్బంది అవుతుందని అన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు దేశెట్టి సాయిరెడ్డి, పీడీఎస్‌యూ నాయకులు మనోజ్, విజయ్, గంగాధర్ పి.వై.ఎల్ నాయకులు భాస్కర్, సాయిలు, రఘు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘంలో అవకతవకలపై విచారణ



విచారణ చేపడుతున్న డీపీఎం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ రూరల్ మండలంలోని చక్రధర్ నగర్ తండాలో మహిళ గూపులో అవకతవకలు జరిగినట్లు ఆరుగురు మహిళలు రూరల్ ఎమ్మెల్యే ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్దన్ కు పిర్యాదు చేశారు. దేనిపై స్పందించిన ఎమ్మెల్యే విచారణకు ఆదేశాలు జారీ చేశారు. డీపీఎం సంధ్యారాణి మంగళ వారం గ్రామంలోని మహిళా సంఘాలవారిని పిలిపించి గ్రామపంచాయతీలో విచారణ చేపట్టి అవక తవకలపై ఆరా తీశారు. తెల్ల కాగితం మీద గ్రూప్ సభ్యుల సంతకాలు తీసుకొని రుణాలు ఇస్తున్నారని, ఒకరికి ఇవ్వాల్సిన రుణాలు మరొకరికి ఇస్తున్నారని కొందరు ఎమ్మెల్యేకు పిర్యాదు చేశారు. మొత్తం ఎన్ని గ్రూప్‌లు పని చేస్తున్నాయి.. ఎంత మంది మహిళలు రుణాలు పొందారు.. ఎంత వడ్డీ వసూళు చేస్తున్నారు.. ఏ గ్రూప్‌లో ఎలా వసూలు చేస్తున్నారు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాతుండగా సీఏ మమత తమ మనుషులకు మాత్రమే రుణాలు ఇస్తున్నారని, బయట మూడు రూపాయలు వడ్డీకి అప్పు ఇస్తుందని కొందరు నిలదీశారు. తండాలో కిరాణ దుకాణం వ్యాపారస్తులకు. ఇతర వ్యాపార స్తులకు వడ్డీకి డబ్బులు ఇస్తుందని ప్రభుత్వ స్కీమ్‌లు ఎవరికి చెప్పకుండానే ఇచ్చేస్తుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో 31 గ్రూప్‌లు ఉండగా 18 గ్రూప్ లు మాత్రమే పని చేస్తున్నా యని తిరుపతి ఆరోపించారు. గ్రూప్‌లో అమాయకులైన సభ్యుల నుండి 3 లేదా 4 వేల రూపాయలు తీసుకొని లక్షన్నర వరకు ఇస్తున్నారని కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ సారి సంఘం లో సమావేశం లేకుండా తీర్మానం లేకుండా వడ్డీలకు ఇస్తున్నారని అడిగే నాథుడే కరువయ్యాడన్నారు. ఇక నుండైనా గ్రూప్ సభ్యులు మీటింగ్ ఏర్పాటు చేసి అందరికీ సమానంగా రుణాలు అందిం చేలా చూడాలని డీపీఎం మహిళ సంఘాలకు వివరించారు. ఏపిఎం మహేష్, సర్పంచ్ హరి, ఉప సర్పంచ్ బాబూరావు, వీడిసీ సుదర్శన్, సీసి వీణా రాణి, తిరుపతి,పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మంత్రిపై విమర్శలు

- బీఆర్ఎస్ మండల నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల



సమావేశంలో మాట్లాడుతున్న మండల నాయకులు

బాల్కొండ నియోజవర్గంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే మంత్రిపై సునీల్ రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూర్ణానందం, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ.. పేద ప్రజలకు అండగా నిలబడుతున్న మంత్రిని విమర్శిస్తే ఊరుకోబోమని, సునీల్ రెడ్డి లాగా బాధిత కుటుంబాలకు 5 వేలో 10 వేలో అందిస్తే అది అభివృద్ధి కాదని, వాటి వల్ల ప్రజల కష్టాలు తీరవని అన్నారు. 2018లో దళితుల ఓట్లు వేయించుకుని, ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీలోకి వెళ్తానని అన్నది నిజం కాదా అని అన్నారు. ఎమ్మెల్యే టికెట్ కోసం మొదటి నుండి అన్ని పార్టీలు తిరగడం అయిపోయిందని, ఈ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఒకసారి కాంగ్రెస్ టికెట్ ఇస్తుందని, మరోసారి బీజేపీ టికెట్ ఇస్తుందని, ఏ టికెట్ రాకపోతే ఇండిపెండెంట్ గా పోటీలోకి దిగుతానని కొత్త రాగం అందుకొంటూ.. తన వెనుకున్న కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తున్నాడని అన్నారు. రాజకీయం చేయాలంటే ఒకే పార్టీ, ఒకే సిద్ధాంతాన్ని నమ్మాలని హితవు పలికారు. నియోజకవర్గంలో ప్రశాంత్ రెడ్డి గంజాయిని పెంచిపోషిస్తున్నాడని, సునీల్ రెడ్డి అవాస్తవమైన ఆరోపణలు చేస్తున్నాడని, సునీల్ రెడ్డి రాజకీయాల్లోకి వచ్చాకే గంజాయికి యువకులు బానిస అయ్యారని, మా దగ్గర ఆధారాలు సైతం ఉన్నాయని,సమయం వచ్చినప్పుడు కచ్చితంగా బయటపెడతామని అన్నారు. ప్రశాంత్ రెడ్డి గ్రామాలను అభివృద్ధి చేస్తూ ఉంటే, చెక్ డ్యాం లలో, బట్టాపూర్ క్రషర్ లో అవినీతి జరిగిందని ఆరోపణలు చేస్తున్నాడని, అవినీతి జరిగిందని ఆధారాలు ఉంటే సంబంధిత శాఖ అధికారులకు అందజేయాలని అన్నారు. నియోజకవర్గంలో మొత్తం కాంట్రాక్టులు ఇప్పిస్తామని, పనులు చేసి చూపెట్టాలని అన్నారు. సమావేశంలో సర్పంచ్ పత్తిరెడ్డి ప్రకాష్, కోఆప్షన్ సభ్యుడు అష్రాఫ్, బీఆర్ఎస్ నాయకులు తుపాకుల శ్రీనివాస్ గౌడ్, బద్దం శ్రీనివాస్ రెడ్డి, అంజిరెడ్డి, కట్కం సాగర్, క్యాతం సుభాష్, ముక్కెర దేవన్న క్యాతం దేవేందర్ ,వేశాల నర్సారెడ్డి, ఆకుల రాజేంధర్, నర్ర అశోక్, బోనగిరి రమేష్, జైనోద్దీన్, ఓర్సు రాములు, కుమ్మరి సహదేవ్, చిల్క కిషన్, మూడ్ గంగారాం, ప్రవీణ్ యాదవ్, కండ్లీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా చేసుకోవాలి

నవతెలంగాణ-ముప్కాల్

ఈ నెల 29న బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ భాస్కరా చారి అన్నారు. మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ ముస్లిం సోదరులకు ముందుగా బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. మైనార్టీ సోదరులు బక్రీద్ పండుగను ప్రశాంతత వాతావరణంలో జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై వుందని అన్నారు.

బైక్‌ల చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్



బైక్‌ల చోరీల కేసులో ముగ్గురిని అరెస్టుచేసినట్టు ఎస్ఐ లింబాద్రి తెలిపారు. ఈమేరకు వివరాలను వెల్లడించారు. మంగళవారం ఉదయం నాలుగున్నర గంటల సమయంలో చంద్రశేఖర్ కాలనీలో ఒక ఇంటి ముందు నలుగురు వ్యక్తులు ఆటోలో వచ్చి ఒక బైకును దొంగలించే ప్రయత్నం చేశారు. అది గమనించిన స్థానికు నిజామాబాద్ రూరల్ పోలీస్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. నిజామాబాద్ రూరల్ ఎస్సై లింబాద్రి, సిబ్బంది వెళ్లారు. వారు అక్కడి నుండి పారిపోతుండగా ఏ-1 షేక్ కరీం ఖాన్ అలియాస్ సోను, షేక్ అజ్మత్, మహ్మద్ అబ్దుల్ మొహిద్‌ను పట్టుకున్నారు. మరొకరు తప్పించుకున్నారు. వారి నుండి ఇదివరకు దొంగిలించిన నాలుగు మోటర్ సైకిళ్లను రికవరీ చేశారు. వారిపై కేసు నమోదు చేసి నిజామాబాద్ రూరల్ ఎస్సై లింబాద్రి వారిని జుడిషియల్ రిమాండ్‌కు పంపించారు. సౌత్ రూరల్ సిఐ సురేందర్ రెడ్డి ఉన్నారు. వారిని ఎసిపి కిరణ్ అభినందించారు.

బాలకార్మికుల సమాచారం సేకరించాలి

- ఆపరేషన్ ముస్కాన్-9పై సమీక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆపరేషన్ ముస్కాన్-9పై సమీక్ష సమావేశం పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్‌లో మంగళవారం నిజామాబాద్ అదనపు డిసిపి (అడ్మిన్) జి. మధుసుదన్ రావ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డిసిపి (అడ్మిన్) మాట్లాడుతూ.. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆపరేషన్ ముస్కాన్ 9 జూలై 01నుండి 31వరకు నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌లలో 18 సంవత్సరాల లోపు తప్పిపోయిన / వదిలివేయబడిన కార్మికులుగా ఉన్న బాలబాలికలు ఉన్నట్లయితే వారి సమాచారం సేకరించాలన్నారు. వారిని తల్లిదండ్రులకు అప్పగించాలని, బలవంతంగా బిక్షాటన చేయించిన వారిపై వెట్టి చాకిరిచేయించిన వారిపై తగిన క్రిమినల్ కేసులు నమోదు చేసి తగినచర్యలు తీసుకునే విధంగా ప్రత్యేకంగా డివిజన్ పరిధిలో ఎస్ఐ, నలుగురు సిబ్బందిని నియమించడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, సిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ మోహన్, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ గోపినాథ్, జిల్లా లేబర్ ఆఫీసర్ యోహాన్, జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బీ, చైల్డ్ వెల్ఫేర్ కమిటి చైర్ పర్సన్ సంపూర్ణ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి శ్రీ చైతన్య, బాల రక్ష భవన్ కో-ఆర్డినేటర్ విజయలక్ష్మీ. నిజామాబాద్ ఇంచార్జీ మహిళా ఆర్ఎస్ఐ స్రవంతి, ఆర్మూర్ ఇంచార్జీ ఎస్ఐ ఇంద్రకరణ్ రెడ్డి, బోధన్ ఇంచార్జీ ఎస్.ఐ. వెంకటయ్య రైల్వే ఎ.ఎస్.ఐ సురేంధర్ సింగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు డీసీపీ

సమావేశాన్ని విజయవంతం చేయండి

- ఎమ్మార్పీఎస్



మాట్లాడుతున్న ప్రభాకర్

నవతెలంగాణ-వేల్పూర్

ఈనెల 29న ఆర్మూర్‌లో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జి ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఈ నెల 29న ఆర్మూర్‌కు వస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తున్న పోరాటంలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీరక్షణకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో వచ్చే నెల 3వ వారంలో లక్షలాది మంది మాదిగలతో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చెయ్యడం కోసం ఆర్మూర్‌లో జరిగే సన్నాహక సమావేశానికి మంద కృష్ణ మాదిగ ఆర్మూర్‌కు వస్తున్నారని తెలిపారు. పెద్ద సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ఇన్చార్జి అధ్యక్షుడు మంద రాజన్న, మండల కన్వీనర్ పోచంపల్లి శ్రీనివాస్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రామన్నపేట బాబురావు వేల్పూర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి




మాట్లాడుతున్న భూపతిరెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి అవినీతి లేని అభివృద్ధి సాధించుకోవాలని నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మాజీ ఎమ్మెల్సీ డా.భూపతి రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..వచ్చే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా గెలుపే లక్ష్యంగా ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కిసాన్‌ఖేత్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, నాయకులు నగేష్ రెడ్డి, ముప్ప గంగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అర్గుల చిన్నారెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షులు సొప్పరి వినోద్, గన్నా లక్ష్మన్, వసంత్ రావు, సైకిల్ అక్బర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన వ్యక్తి

నవతెలంగాణ-ఆర్మూర్

టీఎస్ ఆర్టీసీ డిఎం కవిత ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ డిపోలో రక్త శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆర్టీసీ కార్మికులు,ఇతరులు కలిసి 65 మందికి పైగా రక్తాన్ని డొనేట్ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొన్న బీఆర్ఎస్ ప్రముఖ సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ యూత్ ఐకాన్ సడాక్ వినోద్ స్వచ్ఛందంగా బ్లడ్ డొనేట్ చేశారు. ఆయనతోపాటు 20 మందికి పైగా రక్తాన్ని డొనేట్ చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ సంస్థకు బ్లడ్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఆర్టిసి ఉద్యోగ నాయకులు చిలుక రవి, చక్రవర్తి, రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ మాజీ అధ్యక్షులు పుష్పాకర్ రావు ఆర్టీసీ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

16 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-కోటగిరి

పోతంగల్ మండలంలోని కొడిచెర్ల, హంగర్గఫారం, పోతంగల్ గ్రామాలకు చెందిన 16 మందికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను బాన్సువాడ సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, బీఆర్ఎస్ మండల నాయకులు వల్లేపల్లి శ్రీనివాసరావు, ఏజాస్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

చందూర్‌లో కుక్కల బెడద



నవతెలంగాణ-వర్ని

మండల కేంద్రంలోని బస్టాండ్ ఏరియాలో వీధి కుక్కల గుంపులతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాలలో నిత్యం ఏదోచోట కుక్క కాటుకు గురై బాధితులు బాధపడుతున్న విషయం తెలిసిందే. కుక్కల గుంపులను చూసి ప్రజలు జంకుతున్నారు. మంగళవారం మండలం కేంద్రంలో కుక్కల గుంపులు, వాటి అరుపులను చూసి ప్రజలు భయాందోళన చెందారు. అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించి ప్రజలకు రక్షణ కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నిరంతర విద్యుత్ కేసీఆర్‌తోనే సాధ్యం

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-భిక్కనూర్

వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. మంగళవారం మండలంలోని రామేశ్వరపల్లి గ్రామంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. భారత దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే విద్యుత్ తీగలపై బట్టలు ఆరబెట్టుకోవాలని మాట్లాడారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడ కూడా 12 గంటల కరెంటు ఇవ్వలేని పరిస్థితి ఉందని, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. దళిత బంధు, రైతు బీమా వంటి పథకాలు ప్రవేశ పెడుతూ రైతులను అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు ఓర్వలేక ఇటు బీజేపీ అటు కాంగ్రెస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ నాయకులు సాధ్యం కానీ హామీలు ఇప్పటి నుంచే ప్రజలకు ఇస్తున్నారని, హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని కోరారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు పెట్టుబడి సహాయం కింద రైతుల ఖాతాలో ఎకరాకు రూ.5వేల చొప్పున అందిస్తున్నామని తెలిపారు. పట్టా పాస్‌బుక్ కలిగిన ప్రతి రైతుకూ రైతుబంధు పథకం అమలు చేస్తామని, బీసీల సంక్షేమం కోసం ప్రభుత్వం కులవృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న పలు సమస్యలను సర్పంచ్ పోతిరెడ్డి ఎమ్మెల్యేకు వివరించారు. దశలవారీగా గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ముజీబొద్దీన్, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ ప్రేమ్ కుమార్, ఎంపీపీ గాల్‌రెడ్డి, జెడ్పీటీసీ పద్మ నాగభూషణం గౌడ్, వైస్ ఎంపీపీ యాదగిరి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హనుమంతరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు నరసింహారెడ్డి, రైతు సమన్వయ కమిటీ మండల కన్వీనర్ రామచంద్రం, జిల్లా కమిటీ సభ్యురాలు మాధవి బలరాం, విద్యుత్ శాఖ దోమకొండ ఏడీఏ కిరణ్ చైతన్య, ఏఈ రామలక్ష్మి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ సిద్ధిరాములు, బీఆర్ఎస్ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు లక్ష్మీ, సొసైటీ అధ్యక్షులు భూమ్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు అనంత గౌడ్, రైతు సమన్వయ కమిటీ గ్రామ కన్వీనర్ బాపురెడ్డి, పాల కేంద్రం అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, ఎంపీడీఓ అనంతరావు, ఎంపీఓ ప్రవీణ్ కుమార్, మాజీ ఎంపీపీ సుదర్శన్, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్



హాజరైన ప్రజలు, నాయకులు

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి



మృతిచెందిన శంకర్

నవతెలంగాణ-భిక్కనూర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మరణించిన ఘటన మండలంలోని సిద్ద రామేశ్వర నగర్ గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూర్ పట్టణానికి చెందిన గంగల శంకర్ (28) సోమవారం సాయంత్రం దాబా హెూటల్‌లో భోజనం చేసి వస్తానని కుటుంబీకులకు చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. సోమవారం సాయంత్రం శంకర్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. మంగళవారం ఉదయం స్థానికులు గమనించి కుటుంబీకులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా హాస్పిటల్ తరలించి, కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఎడపల్లి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై పాండేరావు వివరాల ప్రకారం.. రెంజల్ మండలం దూపల్లి గ్రామానికి చెందిన సుభాష్ అనే వ్యక్తి కూతురు నిజామాబాద్ ఆసుపత్రిలో కాన్పు కాగా చేతిలో డబ్బు లేకపోవడంతో సుభాష్ అనే వ్యక్తి సోమవారం సాయంత్రం మోటార్ సైకిల్‌పై నిజామాబాద్ నుంచి దూపల్లి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బషీర్ ఫారం వద్ద బోధన్ నుంచి నిజామాబాద్ వైపువస్తున్న మహారాష్ట్రకు చెందిన కారు బలంగా ఢీకొనడంతో భూమేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. సుభాష్‌ను వెంటనే జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-భిక్కనూర్

వ్యక్తి అదృష్టమైన ఘటన భిక్కనూర్ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూర్ పట్టణానికి చెందిన ముదాం నరేష్ గత 25 రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి తిరిగి రాలేదు. గతంలో కూడా ఇంటి నుంచి బయటకు వెళ్లి 15 రోజుల తర్వాత ఇంటికి వచ్చాడు. అదేవిధంగా మళ్లీ వస్తాడని కుటుంబీకులు 25 రోజులు ఎదురు చూశారు. చుట్టుపక్కల, కుటుంబీకుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ దొంగలొస్తున్నారు.. రైతులు తస్మాత్ జాగ్రత్త

- పోలీసుల హెచ్చరిక

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండల గ్రామాల్లోని రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని మండల పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. పలు మండలాల గ్రామాలలోని బోరు బావుల వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ల కాయిల్స్ దొంగిలిస్తున్నారని, రెండు రోజుల క్రితం గాంధారి మండలంలో ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాయిల్స్ దొంగతనం జరిగినందున పక్కనే ఉన్న సదాశివనగర్ మండలంలోని రైతులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రైతులు గస్తి ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. అన్ని గ్రామాల్లో సర్పంచులు దండోరా వేయించాలని అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని లేదా 100కు ఫోన్ చేయాలని తెలిపారు.

చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి చెక్‌పోస్టు వద్ద ఎస్సై పండ్ల సాయన్న వాహనాలను తనిఖీ చేశారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని వాహనాలలో గోవుల తరలింపు, అక్రమ మద్యం రవాణా అరికట్టడానికి ప్రత్యేక చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

- కంటి వెలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్ కుమార్

నవతెలంగాణ-ఎడపల్లి

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కంటి వెలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్ కుమార్ అన్నారు. మండలంలోని నెహ్రూనగర్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. పాఠశాలలో నీళ్ల నిలువకుండా లేకుండా చూడాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అమ్మానుల్లా షరీఫ్, వైస్ ఎంపీపీ ఇమ్రాన్ ఖాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-భిక్కనూర్

హైదరాబాద్‌లోని మంత్రి మల్లారెడ్డికి చెందిన మల్లారెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని కాచాపూర్, కంచర్ల గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంతకుముందు కాచాపూర్ సర్పంచ్ సులోచన సుదర్శన్, కంచర్ల సర్పంచ్ చంద్రకళ మాధవరెడ్డి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి ప్రతి ఒక్కరూ వైద్య శిబిరంలో వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు గ్రామస్తుల తరపున ఆయా గ్రామాల సర్పంచులు మల్లారెడ్డి హాస్పిటల్ వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గాల్ రెడ్డి, ఉపసర్పంచ్ సిద్దాగౌడ్, కంచర్ల ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శులు, డీసీసీబీ డైరెక్టర్, బస్వాపూర్ సొసైటీ చైర్మన్ కిష్టాగౌడ్, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంపై పోరు

- ఎస్ఎఫ్ఐ బోధన్ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-బోధన్

ఎస్ఎఫ్ఐ బోధన్ మండల నూతన కమిటీ కన్వీనర్‌గా బి.సాయిని నియమించినట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ అనిల్ తెలిపారు. మంగళవారం బోధన్ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాతంత్ర అవసరాల రీత్యా ఎస్ఎఫ్ఐ బోధన్ డివిజన్ కార్యదర్శి తలారే సంజయ్‌ను అన్ని బాధ్యతల నుంచి శాశ్వతంగా తొలగించినట్టు తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో ఈ నెల 28న జరిగే జిల్లా కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా తలారే సంజయ్ జిల్లా సహాయ కార్యదర్శిగా, బోధన్ డివిజన్ కార్యదర్శిగా ఉన్న సమయంలో విద్యారంగ సమస్యలపై ఎన్నో పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. అదేవిధంగా నూతన కన్వీనింగ్ కమిటీని ఏడుగురు సభ్యులతో ఎన్నుకున్నట్టు పేర్కొన్నారు. నూతన కమిటీ కన్వీనర్‌గా బీ.సాయి, కోకన్వీనర్‌గా కే ప్రశాంత్‌ను ఎన్నుకున్నట్టు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మండల కన్వీనర్ సాయి మాట్లాడుతూ.. బోధన్ డివిజన్‌లో విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటాలకు సిద్ధమవుతామని అన్నారు. అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శాస్త్రీయ విద్యా విధానానికి అడుగులు వేయాలని హితువు పలికారు. అదేవిధంగా ప్రవేట్ పాఠశాలలో, కళాశాలలో అధిక ఫీజుల పేరిట విచ్చలవిడిగా దోపిడీ జరుగుతుందని వాటికి వ్యతిరేకంగా భవిష్యత్తులో ఉద్యమాలు రూపొందిస్తామని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ హాస్టల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కోకన్వీనర్ కె.ప్రశాంత్, సభ్యులు శివాజీ, సురేష్, అజయ్, విశాల్, దేవ్‌ను ఎన్నుకున్నారు.



ఎన్నికైన మండల కమిటీతో జిల్లా కార్యదర్శి

జర్నలిస్టు పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాలి

- వినతిపత్రం అందజేసిన టీడబ్ల్యూజేఎఫ్



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-తాడ్వాయి

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని డీఈవో కార్యాలయంలో జర్నలిస్టు పిల్లలకు 50శాతం రాయితీ ఇవ్వాలని డీఈవో రాజుకు మంగళవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సిద్దాగౌడ్, ప్రధాన కార్యదర్శి బొక్కల వేణు, ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్ ప్రవీణ్ గౌడ్, ఉపాధ్యక్షుడు కరుణాకర్, శ్రావణ్, తదితరులున్నారు.

సర్వహక్కులు ఉన్నా.. ఎన్ఎస్ఎఫ్ భూములను అమ్ముకోనివ్వరా?

నవతెలంగాణ-బోధన్

బోధన్ చక్కెర కర్మాగారానికి చెందిన 14 ఫారంలు అయిన బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల్లో ఉన్న ఫ్యాక్టరీ భూములను కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఫ్యాక్టరీకి చెందిన కూలీలకు, వివిధ కార్పొరేషన్ల ద్వారా కొనుగోలు చేసి పంచిన భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ సర్వహక్కులు కలిగి ఉన్నా, నేడు వాటిని ఇంటి అవసరాలకు విక్రయించేందుకు ప్రయత్నిస్తే ప్రభుత్వం వాటి రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం ఎంత వరకు సమంజసమని సీపీఐ నాయకులు ప్రశ్నించారు. మంగళవారం బోధన్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. క్రయవిక్రయాలు జరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బాన్సువాడ, బోధన్ ఎమ్మెల్యేలు మహ్మద్ షకీల్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి తక్షణమే ముఖ్యమంతి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి షేక్ బాబు, మహ్మద్ గౌస్, షబ్బీర్, మన్నాన్, సలీం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గ్రామాలలో బలోపేతం చేయాలి

- డీసీసీ ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి

నవతెలంగాణ-భిక్కనూర్

కాంగ్రెస్ పార్టీని గ్రామాలలో బలోపేతం చేయడానికి ప్రతి ఒక్క నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని డీసీసీ ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని కాచాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నియోజకవర్గంలో మాజీ మంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్న విధానాన్ని ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింగ్ రావు, నాయకులు రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ యాదయ్య, దశరథ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

విద్యార్థులు క్విజ్ పోటీలు అలవర్చుకోవాలి

- యూనియన్ బ్యాంక్ మేనేజర్ ముఖేష్ కుమార్ మీనా

నవతెలంగాణ-పిట్లం

విద్యార్థులు క్విజ్ పోటీలను అలవర్చుకోవాలని యూనియన్ బ్యాంకు మేనేజర్ ముఖేష్ కుమార్ మీనా అన్నారు. మంగళవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆల్ ఇండియా క్విజ్ ఆన్ ఫైనాన్షియల్ లీటరసీ స్కూల్ చిల్డ్రన్) వారి సౌజన్యంతో మండల కేంద్ర బాలుర ఉన్నత పాఠశాలలో పిట్లం, పెద్దకొడప్‌గల్, నిజాంసాగర్ మండలాల ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు క్రీడలు క్విజ్ పోటీలు అలవర్చుకుంటే పూర్తి ఆరోగ్యంతో పాటు మేధోశక్తి పెంపొందడం వల్ల భవిష్యత్తులో జీవితానికి ఎంతో తోడ్పడతాయని ఆయన అన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతోపాటు ప్రశంస పత్రములు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దేవి సింగ్, ప్రధానోపాధ్యాయుడు సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు రాందాస్, రమేష్, కల్పన, కమల, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

ఆలయం ఆవరణలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం




రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్మెన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణంలోని పోచమ్మ గుడి ఆవరణలో మంగళవారం మున్సిపల్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచమ్మ ఆలయ ఆవరణలో శుభ్రంగా ఉండడానికి ఐదు లక్షలతో సిమెంట్ వేస్తున్నట్టు తెలిపారు. దీనికి స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ అనుమతితో పనులు ప్రారంభించినట్టు వివరించారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు పదికాలాలపాటు చెడిపోకుండా భక్తులకు ఇబ్బంది కలగకుండా సీసీ చేయాలని కాంట్రాక్టర్ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పద్మ శ్రీకాంత్, అల్లం శ్రీను, ఆలయ కమిటీ కార్యదర్శి వినోద్, బీఆర్ఎస్ ప్రతినిధులు అధిములం సతీష్, ప్యాలల రాములు, కోర్న నారాయణ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ బాధిత కుటుంబానికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

- జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి



నవతెలంగాణ-రామారెడ్డి

గల్ఫ్ బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఉప్పల్వాయి గ్రామానికి చెందిన పురం సిద్ధిరాములు మస్కట్‌లో ఏజెంట్ మోసంతో తిండి లేక ఆరోగ్యం క్షీణించి మృతిచెందగా మంగళవారం వారి కుటుంబాన్ని, అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు జంగిటి నారాయణ గత కొద్ది రోజుల నుంచి అదృశ్యమై ఆచూకీ తెలవకపోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం వెంటనే గల్ఫ్ పాలసీని అమలు చేసి, గల్ఫ్ బాధిత కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మద్దెల బాగయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిరెడ్డి మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్యకు సన్మానం

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని రేణుకాదేవి ఆలయంలో గౌడ సంఘం మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్యను మంగళవారం శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందిస్తానని, తన పై నమ్మకం ఉంచి సీడీసీ చైర్మన్‌గా నియమించిన ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్‌కు రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మేనేజ్మెంట్ సభ్యులు తీగల సుదర్శన్ గౌడ్, రావులపల్లి ప్రసాద్ గౌడ్, సిద్ధాగౌడ్, కర్రోళ్ల రామాగౌడ్, తీగల నాగభూషణం గౌడ్,నర్సాగౌడ్,హరి గౌడ్, చింతకింది సత్యనారాయణ గౌడ్, కర్రోళ్ల శ్యాంసుందర్ గౌడ్, కర్రోళ్ల భీమాగౌడ్, కానుగంటి నాగరాజు, పెద్దమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు పున్నలక్ష్మణ్, శివరాం మందిర ఆలయ కమిటీ చైర్మన్ అబ్రబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.



నర్సయ్యను సన్మానిస్తున్న దృశ్యం

'మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్' వీక్షించిన నాయకులు

నవతెలంగాణ-బోధన్/రెంజల్/నిజామాబాద్‌రూరల్

మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్ కార్యక్రమంలో భాగంగా మధ్యప్రదేశ్ రాష్టంలోని భోపాల్ నుంచి మంగళవారం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ సందేశాన్ని బోధన్ పట్టణంలోని ఎంపీఆర్ కార్యాలయంలో, రూరల్ మండలంలోని మల్లారం గ్రామంలో బీజేపీ నాయకులు వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, వడ్డీ మోహన్‌రెడ్డి, బీజేపీ రూరల్ మండల అధ్యక్షులు జగన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు యాదగిరిగౌడ్, సెక్రటరీ అన్నం గోపి, ఉప సర్పంచ్ రవి తదితరులున్నారు.

మోడీ ప్రసంగం వీక్షించిన జడ్పీటీసీ

రెంజల్ : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగాన్ని రెంజల్ జడ్పీటీసీ మేక విజయ సంతోష్ మంగళవారం కార్యకర్తలతో వీక్షించారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు మేక సంతోష్, పార్థ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గౌరారం యూత్ కాంగ్రెస్ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గారి కృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని గౌరారం గ్రామ యూత్ కాంగ్రెస్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లెపు లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు గైన బాలు, కార్యదర్శిగా బొల్లారం శ్రీకాంత్‌ను కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీలకు పోతంగల్ విద్యార్థులు



నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి ఉమ్మడి మండలంలోని పోతంగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆర్.అనిరుద్ పదవ తరగతి, అబ్దుల్ వదూద్ 9వ తరగతి విద్యార్థులు రుద్రూర్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన క్విజ్ పోటీలలో రూ.5వేల ప్రథమ బహుమతి పొందినట్టు ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీలలో కోటగిరి, పోతంగల్, రుద్రూర్ మండల విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు.

ఆదర్శ మండలంగా ఉండాలి

- సెర్ప్ ఐబీ రాష్ట్ర డైరెక్టర్ భారతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మహిళా సంఘ సభ్యులు వీవోఏ సహాయం లేకుండా సంఘం బుక్కులను రాసుకోవాలని, దేశానికే ఆదర్శ మండలంగా ఉండాలని సెర్ప్ ఐబి రాష్ట్ర డైరెక్టర్ భారతి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో మండల మహిళా సమైక్య సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర సెర్ప్ డైరెక్టర్ భారతి హాజరై మాట్లాడుతూ... మహిళా గ్రామ సంఘం స్వతహాగా నడిపించుకునే స్థాయికి రావాలన్నారు. మండల మహిళా సమాఖ్యను నడిపించుకోవాలన్నారు. బ్యాంకు నుంచి రుణాలు తీసుకోకుండా మండల సమైక్య నుంచే అప్పులు ఇచ్చే స్థాయికి రావాలన్నారు. ప్రతి సభ్యురాలు తన కాళ్ళపై తాను నిలబడాలని తెలిపారు. మండల మహిళా సమాఖ్య దేశంలో ఆదర్శ మండల మహిళా సమైక్యగా పేరు తెచ్చుకోవాలన్నారు. గ్రామ సంఘంలో ఉన్న ప్రతి సభ్యురాలికి ఆదాయాలు ఖర్చులు తెలిసి ఉండాలన్నారు. ప్రతి నెల ఈసీ మీటింగ్ నిర్వహించుకోవాలని సూచించారు. మండల మహిళా సమైక్య పారదర్శకంగా ఉండాలన్నారు. బ్యాంకు లింకేజీ కమిటీ, అప్పు రికవరీ కమిటీ, జీవనోపాదుల కమిటీ పకడ్బందీగా పనిచేస్తూ మండల మహిళా సమైక్యను దేశానికి ఆదర్శంగా ఉంచాలన్నారు. లాభం పెంచుకోవాలని నష్టాన్ని తగ్గించుకోవాలని సూచించారు. తమ హక్కులను బాధ్యతలను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సమైక్య కార్యదర్శి వనిత. ఐబి ఏపీఎం సరోజిని, ఏపీఎం రవీందర్ రెడ్డి, మండల సమైక్య ప్రతినిధులు ప్రతి గ్రామం నుంచి వచ్చిన వివో అధ్యక్షురాలు, డి ఎం జి జనార్ధన్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, మండల సమైక్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర సెర్ప్ డైరెక్టర్ భారతి

అగ్ని ప్రమాద బాధితులకు దుప్పట్లు, వంట సామగ్రి పంపిణీ



దుప్పట్లు, వంటసామగ్రి పంపిణీ చేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని రాంపూర్ గ్రామంలో వారం కిందట గ్రామానికి చెందిన అంజయ్య నివాసగుడిసే దగ్ధం కావడంతో ఎల్లమ్మ గడ్డ తండా సర్పంచ్ ఎర్రబోగుడ భీమ్రావు తన వంతు సర్పంచ్ సమక్షంలో వంట సామగ్రి మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. గత వారం రోజుల క్రితం అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశాల మేరకు సర్పంచ్ హనుమవ్వ కిషన్ సహకారంతో మండలంలోని ఎల్లమ్మ తండా సర్పంచ్ ఎర్ర బొగుడ భీమ్‌రావు తనకు తోచిన సహాయంగా దుప్పట్లు, దుస్తులు, వంట సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హనుమవ్వ కిషన్, ఉప సర్పంచ్ రామవ్వ యాదగౌడ్, భవానీపేట్ సర్పంచ్ నర్సమ్మ ప్రకాష్, తెలంగాణ కళాకారుడు ఆకుల మహేందర్, ముస్తాపూర్ సర్పంచ్ మమత వివేకానంద గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలు కావలెను

నవతెలంగాణ-నిజామాబాద్

జిల్లాలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహం, కళాశాల వసతి గృహంలో పనిచేసేందుకు ఏఎన్ఎంల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు గిరిజన అభివృద్ధి అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఆన్‌లైన్‌లో https://tsobmms.cgg.gov.in ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. అభ్యర్థులు పది/ఇంటర్ పాసై ఉండి, ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థలో 18 నెలల ఏఎన్ఎం శిక్షణలో ఉత్తీర్ణులై ఉండాలని, లేదా దానికి సమానమైన అర్హత ఉండాలని తెలిపారు. నెలకు రూ.22750 వేతనం అందజేస్తామని తెలిపారు. దరఖాస్తులు జూలై 3వ తేదీ నుంచి 13వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9440004870 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

కౌశిక్‌రెడ్డిని ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలి

- శవయాత్ర, దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/వేల్పూర్



కమ్మర్‌పల్లి : శవయాత్ర నిర్వహిస్తున్న ముదిరాజ్‌లు



వేల్పూర్‌లో దిష్టిబొమ్మ దహనం

బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి ముదిరాజులపై చేసిన అనుచిత వ్యాఖ్యలు నిరసిస్తూ మండల కేంద్రంలో మంగళవారం మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ నుండి హాస కొత్తూర్ చౌరస్తా వరకు డప్పుచప్పుళ్లతో బాణాసంచా కాలుస్తూ కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు ముదిరాజ్ నాయకులు మాట్లాడుతూ బాధ్యతాయుతమైన ఎమ్మెల్సీ పదవిలో ఉండి జర్నలిస్ట్ పై దాడి చేయడమే కాకుండా యావత్తు రాష్ట్ర ముదిరాజ్ కులస్థులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి బేషరతుగా ముదిరాజు కులస్తులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ కులస్తులను అవమానపరుస్తూ వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.అనంతరం కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ముదిరాజులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేయడంతో రోడ్డు కిరువైపులా పదుల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి.

వేల్పూర్ :మండలంలోని లక్కోర ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా లక్కోర ముదిరాజ్ సభ్యుడు మాట్లాడుతూ బాధ్యత గల పదవిలో ఉంటూ ఒక విఎస్ఆర్ ఛానల్ జర్నలిస్టును అసభ్య పదజాలంతో దూషించడం, కులాన్ని అవమానపరిచే విధంగా మాట్లాడడం సబబు కాదని అన్నారు. ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిని పదవి నుంచి తొలగించాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని ముదిరాజ్ నాయకులు హెచ్చరించారు. వి ఎస్ ఆర్ ఛానల్ రిపోర్టర్ పై దాడి చేయడం కొట్టడం గదిలో నిర్బంధించడం, ముదిరాజులపై ఇష్టం వచ్చినట్లు అసభ్యకరమైన మాటలతో తిట్టడం సరికాదని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ఖబర్దార్ కౌశిక్ రెడ్డి బహిరంగంగా ముదిరాజులకు క్షమాపణ చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఉపాధ్యక్షులు ముత్యాల ప్రవీణ్ అలాగే బిజెపి సీనియర్ నాయకులు బట్టు లక్ష్మణ్, లాక్కోర ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాంలు అందజేత



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-వర్ని(మోస్రా)

మండలంలోని గోవూర్ హైస్కూల్ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన స్కూల్ యూనిఫాంలను పాఠశాల చైర్మన్ నన్నేసాబ్ ఉపాధ్యాయులతో కలిసి మంగళవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం రెండు జతల బట్టలను విద్యార్థులకు అందిస్తుందని ఒక జత బట్టలు కుట్టడం పూర్తి కావడంతో 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఒక జత బట్టలు పంపిణీ చేశామన్నారు. మరో జత బట్టలు త్వరలో పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు, జరీనా, ప్రసన్న లక్ష్మి, సృజన, శుభాంగి, విజయలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్‌సీ ప్రవేశాలకు శిక్షణ

నవతెలంగాణ-నిజామాబాద్

జూలూ-2024(సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్) యూపీఎస్‌సీ ప్రవేశానికి 2024 సంవత్సరానికి గాను ఉచిత శిక్షణ కోసం తెలంగాణ స్టేట్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ స్టడీ సర్కిల్ బంజారాహిల్స్ రోడ్ నెం 14 హైదరాబాద్ వారు 33 జిల్లాలలోని ఏదైనా డిగ్రీ కలిగిన ఎస్సీ/ఎస్టీ/బిసి స్త్రీ, పురుష అభ్యర్థుల నుండి ఆన్‌లైన్‌లో www.tsstachycircle.co.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు నిజామాబాద్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.శశికళ, టియస్ యస్‌సి స్టడీ సర్కిల్ నిజామాబాద్ సంచాలకులు రాజగంగారాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.00 లక్షల కంటే తక్కువ ఉండాలని సూచించారు. దరఖాస్తులకు చివరి తేది: 02-07-2023 లోపల ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష తేది: 09/07/2023 నాడు హైదరాబాద్, వరంగల్, నిజామాబాదు జిల్లా కేంద్రాలలో ఉదయం 10-30 గంటల నుండి మధ్యాహ్నం 01-30 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం. 040-23546552 సంప్రదించాలని సూచించారు.

నేడు కామారెడ్డిలో జాబ్‌మేళా

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ప్రయివేటు రంగములో ఉద్యోగాలు కల్పించేందుకు బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పనధికారి బి.పి. మధుసూధన్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28/06/2023 బుధవారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్ లోని మొదటి అంతస్తులో గల రూమ్ నెంబర్ 121 లోని జిల్లా ఉపాది కల్పనా కార్యాలయం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రయివేటు ఫైనాన్స్ సెక్టార్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటీవ్ పోస్టులున్నట్టు తెలిపారు. కామారెడ్డి, నిజామాబాద్, రామాయంపేట్‌లో అవకాశాలున్నట్టు తెలిపారు. పదో తరగతి పాసై, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. రూ.10,000 వేతనంతో పాటు ఇన్సెంటివ్ అందజేయనున్నట్టు తెలిపారు. 20-30 ఏండ్ల లోపు గల వారు అర్హులని తెలిపారు. తమ స్టడీ సర్టిఫికేట్‌లతో హాజరు కావాలని, ఇతరాత్ర వివరాలకు 8897921985, 9848237987, 7671974009 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

జనాభా నియంత్రణపై అవగాహన కల్పించాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుదర్శనం

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి సుదర్శనం

జనాభా నియంత్రణపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుదర్శనం అన్నారు. వచ్చే నెల 11న ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఈనెళ 27 నుండి ప్రపంచ జనాభా నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సందర్భంగా ఏరియా ఆసుపత్రిలో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుదర్శనం మాట్లాడుతూ.. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాల్లో భారతదేశం మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అధిక జనాభావల్ల అనేక రకాల సమస్యలు తలెత్తుతాయని, జనాభా నియంత్రణలో భాగంగా ఆరోగ్య శాఖ తరపున అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అలాగే కుటుంబ నియంత్రణ పద్ధతులు, తాత్కాలిక పద్ధతులు ఐయూసీడీ, కాపర్‌టీ, నోటి మాత్రలు, కండోమ్స్, శాశ్వత పద్ధతులు టూబెక్టమీ, వేసెక్టమీ పాటిస్తూ ఒకరు లేదా ఇద్దరు పిల్లలను మాత్రమే కలిగి ఉండి జనాభా నియంత్రణపై అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునేషన్ అధికారి డాక్టర్ అశోక్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రమేష్, డివిజన్ స్థాయి వైద్యాధికారులు, సూపర్వైజర్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

థామస్ బీఎడ్ కళాశాలలో ఫుడ్ మేళా



ప్రశంసాపత్రం అందజేత

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో గల థామస్ బీఎడ్ కళాశాలలో మంగళవారం ఫుడ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఛాత్రోపాధ్యాయులు రకరకాల రుచికరమైన వంటలను తయారుచేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్ కుమార్ రోడే, లెక్చరర్‌లు నాగజ్యోతి, ఆస్మా, ఉస్మాన్, ఆఫ్రిన్ పాల్గొన్నారు.

'వికలాంగుల బంధు' ఇవ్వాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న వికలాంగులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

వికలాంగుల కోసం వికలాంగుల బంధును అమలు చేయాలని వికలాంగులుగా హక్కుల పోరాట సమితి జాతీయ మహిళ అధ్యకురాలు సుజాత సూర్యవంశీ డిమాండ్ చేశారు. మండలంలోని స్థానిక తహశీల్దార్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికలాంగులకు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలని అన్నారు. వికలాంగులు సంక్షేమ శాఖను ఏర్పాటు చేయాలని, జీఓ నెంబర్ 34 అమలు చేస్తూ 33 జిల్లాలో వికలాంగులు సంక్షేమ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్.బీ.ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాకాసిపేట (జేసీ)లో మంగళవారం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్.బీ.ఐ) ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని సాలూర, బోధన్ పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలుగా ఎంపికయిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రాజేశ్వరశర్మ, సాయిలు, ఉపాధ్యాయులు వీరప్ప, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆర్మూర్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో, వేల్పూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఫీజు పోటీలు నిర్వహించినట్టు కవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాజా గంగారం ఉపాధ్యాయ బందం పాల్గొన్నారు.. ఆల్ ఇండియా క్విజ్ ఆన్ ఫైనాన్షియల్ లిటరసీ ఫర్ స్కూల్ చిల్డ్రన్‌ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేల్పూర్ నందు నిర్వహించడం జరిగింది దీనికి నోడల్ అధికారిగా ఎస్‌బీఐ వేల్పూర్ ఫీల్డ్ ఆఫీసర్ నవీన్, ఇన్విజిలేటర్ గా వెల్మల్ అశోక్ వ్యవహరించారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కుకునూర్, ద్వితీయ బహుమతి జిల్లా పరిషత్ రామన్నపెట్, తృతీయ బహుమతి జిల్లా పరిషత్ అంక్సాపుర్ విద్యార్థులు నిలిచారు. విజేతలకు బహుమతులను మండల నోడల్ అధికారి లింగన్న, ప్రధానోపాధ్యాయులు రాజన్న, మండల పీఆర్‌టీయూ అధ్యక్షులు గంట అశోక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రమన్నపెట్,లక్కోర పాఠశాలల ప్రధానోపాధ్యా యులు అశోక్, లక్ష్మణ్, ఉపాధ్యాయులు మహేందర్, మాదర్, రవిచంద్ర, లావణ్య రవి, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనానికి పదివేలు విరాళం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

జడ్పీటీసీ సుమలత గోపాల్ రెడ్డి అన్న టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గంగారెడ్డి జ్ఞాపకార్థం పాఠశాల అభివృద్ధికి రూ.10వేలు విరాళం అందజేశారు. ఈమొత్తాన్ని పాఠశాల హెచ్‌ఎంకు మంగళవారం అందజేశారు.

విత్తనాలు అందుబాటులో ఉంచాం

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ రీజినల్ మేనేజర్

నవతెలంగాణ-నిజామాబాద్

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌కు అవసరమయ్యే విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు విత్తనాభివృద్ధి సంస్థ రీజినల్ మేనేజర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వానాకలం సాగుకు రైతులకు అవసరమయ్యే వరి, ఆపరాలు, పచ్చిరొట్టె విత్తనాలు పంపిణీ కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. పచ్చిరొట్టె విత్తనాలైన జీలుగ, జనుము విత్తనాలను 65 శాతం సబ్సిడీతో అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. నాణ్యమైన విత్తనాలు సరఫరా చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 194 కేంద్రాల ద్వారా ఈ సీజన్‌లో రైతులకు విత్తనాలను అందజేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే ఆయా పంపిణీ కేంద్రాలకు 15,500 క్వింటాళ్ల వరి విత్తనాలు, 16,800 క్వింటాళ్ల పచ్చిరొట్ట, 175 క్వింటాళ్ల ఆపరాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. వీటితో పాటు కందులు, మినుము విత్తనాలు సైతం సరఫరా చేసినట్టు తెలిపారు. సబ్సిడీ ధరలపై పచ్చిరొట్ట విత్తనాలు పొందేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉందని, కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓటర్‌లిస్ట్ పరిశీలన



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని పంచముఖ హనుమాన్ కాలనీలో ఓటర్ జాబితాలను మంగళవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. బిఎల్వోలు ఇంటింటికి వెళ్లి జాబితాలో ఉన్న వ్యక్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతి చెందిన వారి పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో తాసిల్దార్ వెంకట్ రావు , అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీ శ్మశాన వాటికలో నూతన బోరు మోటారు ఏర్పాటు

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్ర గ్రామపంచాయతీ పరిధిలోని మైనార్టీ శ్మశాన వాటికలో నూతన బోరు మోటర్ ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మైనార్టీ శ్మశాన వాటిక యందు గతంలో బోర్ మోటర్ పంపు ఏర్పాటు చేసినప్పటికీ ఇటీవల కాలంలో బోర్ మోటర్ చెడిపోవడం మూలాన ముస్లిం సోదరులకు అంత్యక్రియల సమయంలో ఇబ్బందులకు గురికావడంతో 40 వేల రూపాయల పంచాయతీ నిధులతో నూతన బోరు మోటర్ బిగించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇబ్రహీం, మాజీ వైస్ ఎంపీపీ నర్సాగౌడ్, మాజీ కోఆప్షన్ మెంబర్లు కరీం, బాషీద్, మాజీ ఉప సర్పంచ్ నయ్యుమ్, వార్డు మెంబర్ గులానీ ఎల్లయ్య, నాయకులు గాండ్ల ప్రకాష్, మెయిన్, మైనారిటీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్ అన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పల్లెపల్లెకు కాంగ్రెస్ గడప గడపకు మదన్ మోహన్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని కట్టకింది తండా, రత్నపూర్, తిమ్మారెడ్డి తండా, మౌలాన్ ఖేడ్ గ్రామాలలో పల్లెపల్లెకూ కాంగ్రెస్ గడప గడపకూ మదన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు తిరుగుతు ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజలు కోసం అమలు పరిచే సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు.